ప్రజాశక్తి

శనివారం 16 సెప్టెంబర్ 2023





పోలీసుల బలవంతంపు అరెస్టుతో పోలీసు స్టేషన్‌లో ఉన్న సిపిఎం నాయకులు

భూస్వాధీన పోరాటం ఉద్రిక్తం

- ◆ సిపిఎం నాయకుల అరెస్టు
- ◆ పోలీసులను అడ్డుకున్న పేదలు, మహిళలు
- ◆ పోరాటానికి దొగిచ్చిన అధికారులు
- ◆ వారం రోజుల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ
- ◆ 21లోపు పట్టాలు ఇవ్వకుంటే మళ్లీ పోరాటం : ఇంతియాజ్

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కోడూరు రెవెన్యూ పొలం సర్వే నెం: 805లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన భూ స్వాధీన పోరాటం ఉద్రిక్తంగా మారింది. గురువారం నాడు ప్రారంభించిన ఈ పోరాటం కొనసాగింపుగా శుక్రవారం కూడా కొనసాగింది. పేదలు కుటుంబ సభ్యులతో కలిసి ఆ ప్రాంతంలో ఎర్రజెండాలు పాతి భూస్వాధీనం చేసుకున్నారు. పేదలను ఆ భూముల నుంచి వెళ్లగొట్టాలన్న ఉద్దేశంతో అధికారులు పోలీసులతో బెదిరించే ప్రయత్నం చేశారు. అదనపు బలగాలను మొహరించి శాంతియుతంగా ఇళ్ల స్థలాల్లో కంపచెట్లను తొలగిస్తున్న పేదలు, సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన పోలీసులు సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ సమయంలో పేదలు పోలీసులతో తీవ్ర స్థాయిలో వాగ్వాదం చేశారు. ఇంతియాజ్‌తో పాటు వ్యకాసం నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మినారాయణలను అరెస్టు చేసి వాహనంలో తరలిస్తుండగా మహిళలు పోలీసు జీపును చుట్టుముట్టి అడ్డుకున్నారు. మహిళలను పక్కకు నెట్టేసి పోలీసులు నాయకులను అరెస్టు చేసి చిలమత్తూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేయనీయకుండా ఆయన చుట్టూ మహిళలు వలయంగా నిల్చున్నారు. దీంతో ఆయన్ను అరెస్టు చేయకుండా పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. నాయకులను అరెస్టు చేసే క్రమంలో పోలీసులు, మహిళలకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఓ మహిళ ఊపిరాడక స్పృహ తప్పి పడిపోయింది. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు కిందపడడంతో ఆయన కాలు బెనికింది. పోలీసులు ఎంత బెదిరించినా మహిళలు వెనక్కు తగ్గలేదు. దీంతో చేసేది లేక పోలీసులు మిన్నకుండిపోయారు.



సిపిఎం నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసు వాహనాన్ని అడ్డుకుంటున్న మహిళలు

వారం రోజుల్లో స్పందించకుంటే మళ్లీ పోరాటం : ఇంతియాజ్

రెవెన్యూ అధికారులు ఇచ్చిన హామీ మేరకు వారం రోజుల్లోపు పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో మళ్లీ పోరాటాన్ని మరింత ఉధృతంగా నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. అధికారులతో చర్చల సమయంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పేదలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నా వారి గురించి పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. అధికారులు వెంటనే స్పందించి అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 21వ తేదీలోపు పట్టాలు ఇవ్వకుంటే మళ్లీ భూస్వాధీన పోరాటాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజప్ప, వెంకటేష్, రామచంద్ర, పేదలు పాల్గొన్నారు. పోరాటంలో భాగంగా గాయపడిన వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, మహిళకు సిఐటియు అనుబంధ సంఘం వైద్యులు విశ్వనాథ రెడ్డి పోరాట ప్రాంతానికి వచ్చి వైద్య చికిత్సలు అందించారు.

పోరాటానికి దిగొచ్చిన అధికారులు
వారం రోజుల్లో పట్టాలు ఇస్తామని హామీ

పోలీసులు బెదిరించి స్థలాన్ని ఖాళీ చేయాలని చెప్పినా పేదలు వినకపోవడంతో చేసేది లేక వారు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహశీల్దార్ నాగరాజు, ఇతర అధికారులు ఆ ప్రాంతానికి వచ్చారు. సిఐ వేణుగోపాల్, ఎస్ఐలు శ్రీనివాసులు, మునీర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాట ప్రాంతంలోనే సిపిఎం నాయకులు, పేదలతో చర్చలు జరిపారు. అర్హులను వారంలోపు అందరికీ పట్టాలు ఇస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాల కోసం ఇంకా దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్రమంగా అరెస్టు చేసిన సిపిఎం నాయకులను అక్కడికక్కడే విడుదల చేయించారు.



పోలీసుల తోపులాట సమయంలో స్పృహ తప్పి పడిపోయిన మహిళ



జగన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఇంటింటికీ 'జగనన్న ఆరోగ్య సురక్ష'


◆ 8వేల మంది సిబ్బందితో సర్వే ◆ కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రభుత్వం చేపట్టిన జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అన్ని గ్రామాల్లోనూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలోని 2వ వార్డు సాయి నగర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. వాలంటీర్ల ద్వారా నమూనా ప్రశ్నపత్రం, వాలంటీర్స్ అవుట్ రీచ్ ప్రొఫార్మాను ఎలా భర్తీ చేస్తున్నారన్న విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఇంటినీ, ప్రతి కుటుంబాన్నీ ఆరోగ్యపరంగా ఉంచే కార్యక్రమమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమం చేపట్టేందుకోసం ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లాలన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్ ఫోన్‌లో డౌన్లోడ్ చేయించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా నిర్వహించే ఇంటింటి కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే వ్యాధుల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇక వినాయక చతుర్థి సందర్భంగా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్, పెనుకొండ, ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పివి. కిషోర్ రెడ్డి, ఎపిపిసిబి ఎఈఈ కృష్ణా రెడ్డి, డిఎంఅండ్ హెచ్ఓ ఎస్‌వి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

7.33 లక్షల ఎకరాలు బీడు..!

- ◆ ప్రత్యామ్నాయమూ పెరగలేదు..
- ◆ 45 మండలాల్లో వర్షాభావం



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికీ 46 శాతం భూమి సాగవలేదు. 7.33 లక్షల ఎకరాల భూమి బీడుగా ఉంది. సెప్టెంబర్ ప్రారంభంలో పడిన వర్షాలతోనైనా ప్రత్యామ్నాయ పంట ద్వారా సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావించారు. కానీ ప్రత్యామ్నాయ పంటల సాగు కూడా పెద్దగా పెరగకపోవడం గమనార్హం. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందనే చెప్పాలి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట సాగు చేసేందుకు వీల్లేకుండా పోయింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 7.33 లక్షల ఎకరాలు బీడుగా ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 16.15 లక్షల ఎకరాలు సాధారణ సాగు ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటికి సాగైంది 8.82 లక్షల ఎకరాల్లోనే. ఇంకా 7.33 లక్షల ఎకరాల భూమి బీడుగా ఉండటం గమనార్హం. మొత్తం సాగు విస్తీర్ణంలో చూసినప్పుడు 54.6 శాతం భూమిలో మాత్రమే విత్తనం పడింది. తక్కిన 46 శాతం భూమి బీడుగానే ఉంది. జిల్లాలల వారీగా చూసినప్పుడు అనంతపురం జిల్లా సాధారణ సాగు భూమి 9.15 లక్షల ఎకరాలయితే సాగైంది 6.22 లక్షల ఎకరాలు. 68 శాతం సాగైంది. సత్యసాయి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలు సాధారణ సాగయితే కేవలం 2.60 లక్షల ఎకరాల్లోనే విత్తనం వేశారు. కేవలం 37 శాతం మాత్రమే సాగైంది. ఈ జిల్లాలో మూడొంతుల భూమి బీడుగా ఉంది.

ప్రత్యామ్నాయమూ పెరగలేదు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాధారం కింద అత్యధికంగా సాగయ్యేది వేరుశనగ పంటయే. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది వేరుశనగ సాధారణ సాగు 10.79 లక్షల ఎకరాలనుకుంటే విత్తనం వేసింది కేవలం 1.46 లక్షల ఎకరాల్లోనే. 11 శాతంలోపే వేరుశనగ సాగైంది. ఆగస్టులో తీవ్ర వర్షాభావంతో రైతులు విత్తనం విత్తుకోలేకపోయారు. ఇక సెప్టెంబర్‌లో పడిన వర్షాలకైనా ప్రత్యామ్నాయ పంటలు సాగవుతాయని ఆశిస్తే ఆ పంటల సాగు కూడా పెద్దగా పెరగలేదు. మొక్కజొన్న, రాగులు, సజ్జ కొంత వరకు మాత్రమే పెరిగాయి. సజ్జ పంట అనంతపురం జిల్లాలో 3528 ఎకరాల్లో సాగైంది. ఇది సాధరణం కంటే కొద్దిగా పెరిగింది. ఇక సత్యసాయి జిల్లాలో రాగులు 2390 ఎకరాల్లో సాగైంది. ఇది కూడా కొద్ది మోతాదులో పెరిగింది. మొక్కజొన్న 35 వేల ఎకరాల్లో సాగైంది. తక్కిన ఏ పంటలు సాధారణ సాగుకుమించి పెరగలేదు.

కొనసాగుతున్న వర్షాభావం

సెప్టెంబర్ మొదటి వారంలో కొద్దిగా వర్షాలు పడినప్పటికీ ఆ తరువాత మళ్లీ వర్షాభావ పరిస్థితులే కనిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటికి 251.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉంది. కాని 186 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. ఇక సత్యసాయి జిల్లాలో 285.5 మిల్లీమీటర్లకుగానూ పడింది 184 మిల్లీమీటర్లు మాత్రమే. ఇది జిల్లా మొత్తంగా చూసినప్పుడు మండలాల వారీగా చూస్తే ఈ వ్యత్యాసాలు మరింత అధికంగానే ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాలకు గానూ 22 మండలాల్లో వర్షాభావం నెలకొంది. సత్యసాయి జిల్లాలో 32 మండలాలకు గానూ 23 మండలాలు వర్షాభావంలో ఉన్నాయి. అందులో ముదిగుబ్బ, లేపాక్షి, పెనుకొండ, రొద్దం మండలాల్లో 60 శాతం కంటే తక్కువ వర్షపాతం పడింది. సెప్టెంబర్ మాసంలోనూ చినుకుజాడలేని మండలాలు కొన్ని ఉండటం గమనార్హం. ఉదాహరణకు రాయదుర్గం మండలంలో సెప్టెంబర్ మాసం ఒకటవ తేదీ నుంచి ఇప్పటి వరకు చూస్తే కేవలం 7.5 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. ఇది సాధారణంలో 80 శాతం లోటుంది. అదే విధంగా బొమ్మనహాళ్‌లో 12 మిల్లీమీటర్లు మాత్రమే సెప్టెంబర్‌లో వర్షపాతం నమోదయింది. ఇలా మండలాల వారీగా చూసినప్పుడు అనేక వ్యత్యాసాలున్నాయి.

మావోయిస్టు మహిళా నాయకురాలు అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మావోయిస్టు పార్టీ మహిళా నేత మరువపల్లీ రాజి అలియాస్ సరస్వతిని శుక్రవారం అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి తెలిపారు. రాజి అలియాస్ సరస్వతి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ప్రత్యేక జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీతోపాటు డిఎస్పీ ఆర్. వాసుదేవన్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ ఎన్ రవీంద్రనాథ్ రెడ్డి తో కలిసి అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విశ్వసనీయ వర్గాల ద్వారా తమకు అందిన సమాచారం మేరకు పుట్టపర్తి డిఎస్పి వాసుదేవన్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ ఎన్ రవీంద్రనాథ్ రెడ్డి పుట్టపర్తి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాగిరి రామయ్య, కొత్తచెరువు ఎస్ఐ లింగన్న సిబ్బందితో కలిసి సరస్వతిని కొత్తచెరువు వద్ద అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. 45 సంవత్సరాల వయస్సు గల రాజి అలియాస్ సరస్వతిది శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం సున్నం వారి పల్లి అని చెప్పారు. 1999లో మావోయిస్టు నేత ఆర్‌వైఎఫ్ నాయకులు ఎస్ఎ రవూఫ్ భావజాలానికి ఆకర్షితురాలై ఆర్‌వైఎఫ్ పార్టీలో చేరిందన్నారు. అప్పటినుంచి మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం పార్టీలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉంటోందన్నారు. ఈమె మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడైన వెస్ట్రన్ ఘాట్స్ స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జి సంజయ్ దీపక్‌రావును 2007లో వివాహం చేసుకుందని చెప్పారు. సరస్వతి ప్రస్తుతం కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర రాష్ట్రాలలో మావోయిస్టు పార్టీ కార్యకర్తగా కొనసాగుతోందన్నారు. పార్టీ కార్యాచరణలో భాగంగా దాడులకు వ్యూహం రచించడం, నిరుద్యోగ యువతను మావోయిస్టు పార్టీలోకి ఆహ్వానించి వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చే పనులు చేస్తుండేదని ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఆమె వద్ద నుంచి రూ 20వేల నగదు, మావోయిస్టు పార్టీ విప్లవ సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అండర్ గ్రౌండ్ లో ఉండి మావోయిస్టు కార్యకలాపాలు సాగిస్తూ వస్తున్న వారు ఎవరైనా మనసు మార్చుకొని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి పలికి జన స్రవంతిలో కలవాలనుకుంటే వారి కుటుంబ సభ్యుల ద్వారా లేదా గ్రామ పెద్దలు, స్వచ్ఛందంగా గాని పోలీసులు ఎదుట లొంగిపోవాలని ఎస్పీ కోరారు. అలాంటివారికి ప్రభుత్వం తరపున సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తాం


ప్రజాశక్తి-హిందూపురం

గణేష్ నిమజ్జనం చేసే గుడ్డం కోనేరు వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ అధికారులతో కలిసి కలిసి గుడ్డం కోనేరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోనేరు వద్ద నిమజ్జానానికి తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు నిమజ్జనం తిలకించడానికి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ జనార్దన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా మట్టిదిబ్బ

అంగన్వాడీ కేంద్రానికి దారిలేని పరిస్థితి

అమరాపురం : మండల పరిధిలోని బసవన్న పల్లి పంచాయతీ పరిధి బుల్లెపల్లి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లే దారికి అడ్డంగా కొంతమంది గ్రామస్తులు ట్రాక్టర్ తో మట్టిని తెచ్చి కుప్పగా పోసినట్లు అంగన్వాడీ కార్యకర్త తిమ్మక్క తెలిపారు. తాను అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్నానని కేంద్రానికి ఏడుగురు పిల్లలు, బాలింతలు, గర్భిణులు వస్తున్నారని తెలిపారు. ఇలా రోడ్డుకు అడ్డంగా మట్టి దిబ్బ వేయడంతో అంగన్వాడి కేంద్రానికి తాను, పిల్లలు వెళ్లలేకపోతున్నామన్నారు. ఈ దారి రెవిన్యూ రికార్డులో సర్వేలో ఉందని, దారి ఉన్న పొలం రైతులు కాక ఇతరులు రోడ్డుకు అడ్డంగా మట్టి వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయింది. విషయాన్ని సిడిపిఓ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు అంగన్వాడీ కార్యకర్త తెలిపింది.



అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిలో అడ్డగా ఉన్న మట్టి దిబ్బ

అభద్రతా భావంతోనే టిడిపి, జనసేన పొత్తు : వైసిపి



రోడ్డును పరిశీలన చేస్తున్న వేణు రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

అభద్రతాభావంతోనే టిడిపి జనసేన పొత్తు పెట్టుకుంటు న్నాయని వైసిపి నాయకులు వేణు రెడ్డి అన్నారు. శుక్రవారం పెనుకొండ రోడ్డులో సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు మున్సిపల్ శాఖ వారు వేస్తున్న నూతన రోడ్డును వార్డు కౌన్సిలర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వేణు రెడ్డి మాట్లాడుతు వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన పొత్తు ఉంటుందని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారిరువురు విడిపోతే కదా.. కొత్తగా పొత్తు ప్రకటించడానికి అని ఎద్దేవాచేశారు. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత బలమైన వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్ మారిపోయారని చెప్పేందుకు వీరి కలయికే ఒక ఉదాహరణ అన్నారు. ఎంతమంది చంద్రబాబులు పవన్ కళ్యాణ్ లు కలిసొచ్చినా వైసిపికి ఎటువంటి భయం, నష్టం కానీ లేదని అన్నారు. సొంతంగా పార్టీ పెట్టినా జెండా అజెండా లేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. వీరి పొత్తుతో ఒరిగేదేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లకుంట ఆనందరెడ్డి, రియాజ్, ఇమ్రాన్, కొటిపి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు క్షణికావేశానికి గురై అత్మహత్యకు పాల్పడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుగు సాగాలని మానసిక వైద్యురాలు జీవన సూచించారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళి మోహన్ అధ్యక్షతన అత్మహత్యల నివారణపై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతు సమాజంలో యువత చిన్న చిన్న కారణాలతో క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకొని తమ తల్లితండ్రుల ఆశయాలను, తమ చక్కటి భవిష్యత్తుని కోల్పోతున్నారన్నారు. ఎన్ని సమస్యలు వచ్చిన ధైర్యంగా ఎదురొడ్డి పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెఫరీ పతకం అందుకున్న 'పురం' విద్యార్థి

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ స్థాయి అండర్ 11-15 గ్రాప్లింగ్ కుస్తీ క్రీడల రెఫరీ పతకాన్ని హిందూపురం విద్యార్థి ఉసామ ఖాన్ అందుకున్నారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు గ్రాప్టింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ గ్రాప్టింగ్ కుస్తీ చాంపియన్ షిప్ పోటీలు హర్యానాలోని రోహతక్‌లో జరిగాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన ఉపామ ఖాన్ పాల్గొని మంచి ప్రతిభ కనబర్చాడు. జాతీయ గ్రాప్టింగ్ రెజ్లింగ్ కమిటీ చైర్మన్ దినేష్ కపూర్, జనరల్ సెక్రెటరీ బీర్జూశర్మ, ఏపీ చైర్మన్ సురేంద్రారెడ్డి చేతుల మీదుగా ఉసామా ఖాన్ గ్రాప్లింగ్ కుస్తీ క్రీడల రెఫరీ పతకం అందుకున్నారు. దీంతో పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.



ఉసామ ఖాన్‌ను అభినందిస్తున్న పుర ప్రముఖులు

మండల స్థాయి క్రీడాపోటీల్లో కొగిర విద్యార్థుల ప్రతిభ

కొగిర: మండల స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని కొగిర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. 800 మీటర్ల పరుగు పందెంలో యం.విజయ్ మొదటి స్థానంలో నిలిచాడు.600 మీటర్ల పరుగుపందెంలో గోపీచంద్ రెండవ స్థానంలో గెలుపొందాడు. షాట్ పుట్ లో జూనియర్ బాలుర విభాగంలో మోహన్ మొదటిస్థానంలో నిలిచాడు. వాలీబాల్ పోటీలో విజయ్, దర్షన్, మధు ఎన్నికయ్యారు.బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ విభాగంలో కొగిర ఉన్నత పాఠశాల బాలికలు,బాలురు గెలుపొంది తాలూకా స్థాయికి ఎన్నిక అయినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో కూడా కొగిర పాఠశాల విద్యార్థులు ఎన్నికయ్యారు.షటిల్ పోటీలలో బాలుర విభాగంలో విజయ్,బాలికల విభాగంలో మేఘన,అనిత,అలేఖ్య,శిరీష విజయం సాధించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ విజయం సాధించడానికి ఫిజికల్ డైరెక్టర్ శ్రీదేవి కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాబిలి చాంద్ బాషా, వెంకటేశులు, హసీనా బేగం, శివయ్య, రామాంజినేయులు, రమేష్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

గుడిబండ : గుడిబండలో హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ భవన నిర్మాణానికి మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి గురువారం భూమి పూజ చేసినట్లు ఎస్‌పిఇ సీసీ దేవరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చాలామంది రైతులు వివిధ రకాల పండ్ల సాగు చేస్తూ ఆ పండ్లను స్థానికంగా సరైన మార్కెట్ సౌకర్యం లేక ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దానిని ప్రభుత్వం గుర్తించి మండల కేంద్రంలో ఆర్టికల్చర్ కలెక్షన్ సెంటర్ ను మంజూరు చేస్తామని చెప్పారు. పండ్లతోటలు సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు,ఎంపీడీవో రామారావు, వ్యవసాయఅధికారివీరనరేష్, వెలుగు ఏపిఎం ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వాల్సిందే : వ్యకాసం


భూమి కొలతలు పట్టుకుంటున్న సాగుదారులు


కొగిర రెవెన్యూ పొలంలో వ్యకాసం ఆధ్వర్యంలో భూపోరాటం
ప్రభుత్వ భూమిలో హద్దులు ఏర్పాటు చేసుకున్న సాగుదారులు

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని కొగిర , కంబాలపల్లి , శ్యాపురం గ్రామాలకు చెందిన భూమిలేని దళిత, బలహీన వర్గాలకు చెందిన సాగుదారులకు పట్టాలివ్వాల్సిందేనని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొగిర రెవెన్యూ పొలానికి చెందిన ప్రభుత్వ భూమినిదాదాపు 200 మంది పేదలు 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సాగుదారులకు అధికారులు పట్టాలివ్వాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా వ్యకాసం, సిపిఎం నాయకులు మూడురోజులుగా సాగుదారులకు ఒక్కొక్కరికి 3ఎకరాలు చొప్పున భూమిని పంపిణి చేపడుతున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అనేకసార్లు భూ పంపిణీ చేసిన వీరి పట్ల రాజకీయ వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. దీంతో ఈ భూమి అసైన్మెంట్ కు నోచుకోలేదన్నారు. పేదసాగుదారులకు ఈ భూమి తప్ప వేరే ఆధారం లేదన్నారు. ప్రతి సంవత్సరం సాగుదారులు ఆరుతులు , వేరు శనగ , జొన్న పంటలు సాగుచేస్తున్నారన్నారు. ఆరుగాలం కుటుంబ సభ్యులు కష్టపడి ప్రభుత్వ బీడుభూమిని సారవంతమైన సాగు భూములుగా తీర్చి దిద్దారన్నారు. గతంలో అధికారులు కూడా కొంత భూమిని అసైన్మెంట్ చేసే పట్టాలు ఇచ్చి మిగిలిన భూమి కూడా అసైన్మెంట్ చేయడానికి అవకాశం ఉండని ఉన్నతాధికారులకు 2011 సంవత్సరంలో నివేదిక ఇచ్చారన్నారు. అప్పటి నుండి సాగు దారులు మండల అధికారులు , జిల్లా అధికారులకు అనేక వినతులు సమర్పించినా ఫలితం కన్పించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూ పంపిణీ చేస్తామని షెడ్యూలు ప్రకటించిన స్థానిక అధికారులు మరోమారు అసైన్మెంట్ చేయకుండా మోసం చేయడానికి పూనుకున్నారని విమర్శించారు. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో ఓ స్వచ్ఛంద సంస్థ కల్పవల్లి పేరుతో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం చేసుకొని కోట్లాది రూపాయలు గడించాలని చూస్తోందని విమర్శించారు. దీన్ని నిలువరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు సాగు చేస్తే మాత్రం నిబంధనల పేరుతో పోలీసుల ద్వారా అరెస్టులు చేయడానికి పూనుకుంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం పేదలకు అండగా నిలబడి కుటుంబానికి 3 ఎకరాలు చొప్పున భూమి పంచి హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. అధికారులు పేదల కష్టాన్ని పరిగణలోకి తీసుకుని రికార్డుల మేరకు వాస్తవాలను గుర్తించి ప్రస్తుత భూ పంపిణీలో అసైన్మెంట్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు సాగుదారులకు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అవసరమైతే ఈ భూ పోరాటాన్ని జిల్లా స్థాయి భూ పోరాటంగా మారుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , జిల్లా కమిటీ సభ్యులు నారాయణ , భూ పోరాట కమిటీ నాయకులు అనిత , రామాంజనమ్మ , నాగార్జున, పద్మ మారుతి లతో పాటు 200 మంది సాగుదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

డిఆర్ఒ కొండయ్య


ఉద్యోగి సమస్య వింటున్న ఆర్డీవో

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానిఇక సత్వర చర్యలు తీసుకుంటామని జిల్లా రెవెన్యూ అధికారి పి.కొండయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతినెల మూడవ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. వివిధ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు వారి ఎదుర్కొంటున్న సమస్యలపై ఇచ్చిన అర్జీలను స్వీకరించామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వినతులను స్వీకరించి ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ వృత్తిలో, వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల ద్వారా సమర్పించుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ శాఖల నుంచి 15 అర్జీలు వచ్చాయన్నారు.కొంతమంది తమ ఆరోగ్య పరిస్థితుల కారణంగా ఇక్కడ నుంచి అనంతపురం జిల్లాకు బదిలీ చేయవలసిందిగా కోరారన్నారు. అలాగే ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కోరారన్నారు. ఈసందర్భంగా పుట్టపర్తి జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆర్ఎ అమలు చేయాలని జీవో ఉన్నప్పటికీ కొన్ని శాఖలలో ఇవి అమలు కావడం లేదని తగిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ లో పనిచేస్తున్న ఉద్యోగులు పెద్దన్న, షబ్బీర్, శోభారాణి, బాబన్న, శ్రీనివాసులు, శేఖర్ తదితరులు వేర్వేరుగా ఆర్డీవోకు అర్జీలు సమర్పించారు. సత్యసాయి తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షులు లింగ రామ్మోహన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై డిఆర్ఒకు వినతిపత్రం సమర్పించారు. అలాగే పెనుకొండ అటవీ శాఖలోని షీప్ ఫారం లో పనిచేస్తున్న నర్సరీ వాచర్ ఉద్యోగి అంజనప్ప గత ఏడాది కాలం నుంచి జీతభత్యాలు తనకు రావాల్సి ఉందని ఇతర బిల్లులు మంజూరు కాలేదని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇంకా జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన ఉద్యోగులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు.

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి కదిరి అర్బన్

పట్టణ శివారు ప్రాంతం మొటికపల్లి పంచాయతీ కౌలేపల్లిలో చెరువు కట్టకు సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ దాదాపు 50 సెంట్ల ప్రభుత్వ భూమి కోటి రూపాయలు పైగా విలువచేస్తుందనిఈ భూమిని అధికార పార్టీ నాయకులు కొందరు పేద ప్రజలను అడ్డం పెట్టుకొని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈవిషయంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడికి సెంటు స్థలం ఇవ్వడానికి సవాలక్ష నిబంధనలు పెట్టే రెవిన్యూ అధికారులు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కోట్ల రూపాయల విలువ చేసే భూమిని ఆక్రమిస్తుంటే పట్టించుకోకపోవటంపై అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. 70 సంవత్సరాల నుంచి బాదు సాబ్ అనే ఒక పేద రైతు అనుభవంలో ఉన్న ఈ భూమిని ఆ రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, తాజుద్దీన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన అవసరం

కదిరి టౌన్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ అన్నారు. కదిరి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి అప్కాస్ట్ ఆధ్వర్యంలో 31 వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఆరోగ్యం, సంక్షేమం, పర్యావరణ వ్యవస్థలను అర్థం చేసుకోవడం అనే అంశంపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తయారు చేయడం కోసం ప్రతి పాఠశాల నుండి ఒక సైన్స్ ఉపాధ్యాయుడికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లియాఖత్ అలీ, జిల్లా కోఆర్డినేటర్ వెంకట స్వామి, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్ నాగ అనిల్,భాస్కర్,మనోహర్ నాయక్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తచెరువు : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనపరచాలని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం వాణిబాయ్ తెలిపారు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్ -14, అండర్ -17 మండలస్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రతి కనపరిచిన వారికి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఇటి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కొత్తచెరువు : గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. మండల పరిధిలోనే బండ్లపల్లి పంచాయతీలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. గ్రామంలో వైద్య సిబ్బంది తిరిగి వైద్య చికిత్సలు నిర్వహించాలన్నారు. ఇంటింటా తిరిగి రక్త పరీక్షలు డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ షుగర్ తదితర జబ్బులను గుర్తించి వారికి మందులను ఉచితంగా అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గొళాపురం గ్రామంలో శుక్రవారం వాసవ్య మహిళా మండలి, కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ విప్రో కేర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని కమ్యూనిటీ హాల్ నందు నిర్వహించారు. వైద్య శిబిరంలో 71మందికి వైద్య సేవలు అందించి, వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చక్ర తేజ రెడ్డి, కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది, ఆశా,అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

దళిత రక్షణయాత్రను జయప్రదం చేయండి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

విజయవాడలో ఈనెల 28న జరిగే దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్క నిమిషానికి ఒకసారి ఎక్కడో ఒక చోట కుల వివక్షత దాడులు దౌర్జన్యాలు భూ ఆక్రమణలు, లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. దళితులకు రక్షణగా అనేక రకాల శక్తుల పోరాటాల అనంతరం వచ్చిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం రోజురోజుకు అపహాస్యం పాలవుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కెవిపిఎస్ చొరవతో దళితులకు ఆర్థిక ప్రగతి కోసం యోధ సంఘాలకు కలుపుకొని నిర్వహించిన పోరాటాల ఫలితంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013లో సాధించామన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ దళితులపై దాడులు పరంపరం కొనసాగుతూనే ఉందన్నారు. కుల వివక్షత రూపుమాపక పోగా రూపం మార్చుకుంటూ పట్టణ ప్రాంతాలకు సైతం ఎగపాకుతోందన్నారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దళితుల ఆత్మ గౌరవం, ఉపాధి, సంక్షేమం మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, అంటరానితనం, కుల నిర్మూలన,సామాజిక న్యాయం సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా దళిత రక్షణ యాత్రను నిర్వహిస్తున్నామనిచెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన పోలీసు పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు మేరకు ప్రతిభా పురస్కారాలను ఎస్పీ మాధవ్ రెడ్డి అందజేశారు. పదవ తరగతి, ఇంటర్ , ఎంటెక్, ఎంబిఎ , పీజీ లలో మంచి మార్కులు సాధించిన 45 మంది పోలీసు పిల్లలకు మొత్తం రూ. 2 . 67లక్షల విలువ చేసే చెక్కులను జిల్లా పోలీసు సంక్షేమ నిధి నుండి అందజేశారు. పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు పిల్లల ప్రతిభను గుర్తించడంతో పాటు పోలీసు కుటుంబాలను గౌరవించాలనే మెరిట్ స్కాలర్ షిప్పులు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, ఎఆ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్‌బి సిఐ రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్ఐలు టైటాస్, నారాయణ, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, హరి, పోలీసు పిల్లలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని లింగాలవారిపల్లిలో నాలుగు కుటుంబాలు టిడిపి నుండి వైసీపీలో చేరాయి. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. గువ్వ రాము, గువ్వ శంకర్, అశ్వర్థరెడ్డి, శ్రీనివాసులు, రంగయ్య కుటుంబీకులు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తంగేడుకుంట సర్పంచి రఫిక్, భారతి సిమెంట్ రఫీక్, బీసీ సెల్ కన్వీనర్ చింత వెంకటేష్, జయసింహా, ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

గుడిబండ : మండల కేంద్రంలో హార్టికల్చర్ సెంటర్ భవన నిర్మాణానికి మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని పండ్లతోటల రైతుల సౌకర్యార్థం మండల కేంద్రంలో ఆర్టికల్చర్ కలెక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, ఎంపీడీవో రామారావు, ఎఒ వీరనరేష్, ఎపిఎం ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈపంట నమోదు తప్పనిసరి

మడకశిర : రైతులు తాము సాగుచేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని రొళ్ల ఎఒ రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని గుడ్డు గుడికి, రత్నగిరి పంచాయతీ కేంద్రాలలోని రైతు భరోసా కేంద్రంలో ఈ పంట నమోదును ఆమె పరిశీలించారు. ఈనెల 30 తేదీ లోపల తాము సాగుచేసిన పంటలను నమోదు చేయించుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రత్నగిరి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్యజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వారధి ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఎంఇఒ ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణం భోజన వసతి తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో నమోదు చేయాలని రికగ్నైజ్డ్ కాపీని డిస్‌ప్లే చేయాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

పొలానికి నీటి కోసం ఘర్షణ

కొడవలితో దాడి

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

ఉమ్మడి బోరు బావి నుంచి చేనుకు సాగునీరు వదులుకునే విషయంలో జరిగిన ఘర్షణలో ఓ రైతు మరో రైతు తలపై కొడవలితో నరికాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో బాధిత రైతు ఆసుపత్రిలో చేరాడు. మండలంలోని కొలిమిపల్లిలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబందించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన ఆరుగురు రైతులు కలసి ఉమ్మడిగా బోరు బావి తవ్వించుకున్నారు. ఆ ఆరుగురు రైతులు ఈ బోరు బావితో వచ్చే నీటితోఉన్న కొంత మేర భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా కేశవ అనే రైతు గురువారం రాత్రి తన వరి పంటకు బోరుబావి నుంచి నీరు వదులుకున్నాడు. కొంతమేర తడి మిగిలిపోయింది. అయితే వంతు మేరకు శుక్రవారం ఉదయం చంద్రాయుడు అనే రైతు తన వరి పొలానికి బోరుబావి నుంచి వచ్చే నీటిని వదులుకున్నాడు. ఆసమయంలో కేశవ అక్కడికి చేరుకుని కొంతమేర తన పొలంలో కొంతమేర నీరు కట్టుకోవాల్సి ఉందని, కట్టుకుంటానని చంద్రాయుడిని అడిగాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారితీసింది. ఆగ్రహించి ఇంటికి వెళ్లిపోయిన కేశవ వేటకొడవలి చేతిలో పట్టుకుని వచ్చి ఒక్కసారిగా చంద్రాయుడు తలపై నరికాడు. దీంతో చంద్రాయుడు తల లోపలి వరకు తెగడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. చికిత్స నిమత్తం గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు చంద్రాయుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మడకశిర : మండల పరిధిలోని గుల్ల సముద్రం గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుల్లసముద్రం గ్రామ సమీపంలో ఆటోని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఈ ప్రమాదంలో మద్దనకుంట గ్రామానికి చెందిన అనిల్ కుమార్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల సేవలు మరువలేనివి

కొత్తచెరువు : విధి నిర్వహణలో పోలీసుల సేవలు మరువలేనివని పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ తెలిపారు కొత్తచెరువు ఎస్ఐ లింగన్న బదిలీ అయిన నేపథ్యంలో స్థానిక స్టేషన్‌లో లింగన్నకు సన్మాన సభను శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి అని అన్నారు. రెండు సంవత్సరాలకు పైగా మండలంలో అంకిత భావంతో విధులు నిర్వహించిన లింగన్న ప్రజల మన్నన పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రాగిరి రామయ్య, ఎస్ఐలు నరసింహులు, దాదా పీర్, పోలీసులు, వైసిపి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బత్తలపల్లి : మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ యుగేశ్వరిదేవి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని అప్రాచెరువు, గుమ్మలకుంట, గంటాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, గదులు తదితర వాటిని పరిశీలించి వాటిని ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఒలు, విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

కొత్తచెరువు రూరల్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. ఈమేరకు ఆమె శుక్రవారం కొత్తచెరువు, మండల పరిధిలోని బండ్లపల్లి, గౌనికుంటపల్లి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా బండ్లపల్లి గ్రామంలో జగనన్న సురక్ష పథకం సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు కుటుంబాలను ఆర్డీవో స్వయంగా సర్వే చేశారు. అనంతరం గౌనుకుంటపల్లి గ్రామంలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయ రెడ్డి, డిటి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్: ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచే కార్యక్రమమే 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండాపురం సచివాలయంలో ఎంపీడీవో రఘునాథ గుప్త అధ్యక్షతన ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ ప్రమీల మూర్తి, డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి, స్థానిక సర్పంచి అనిత వెంకటరమణ, ఎంపీటీసి సుకన్య జయచంద్ర రెడ్డి , కొండాపురం ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, మండల వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

నల్లచెరువు : మండల పరిధిలోని కే.పూలకుంట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో నిర్వహించిన ఈ సమీక్షలో అధికారులు మాట్లాడుతూ సమిష్టిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లచెరువు పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఐనుద్దీన్, డాక్టర్ నాగార్జున రెడ్డి, ఏవో రామకృష్ణ, సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచి యూసఫ్, సెక్రెటరీ రమణప్ప నాయుడు, ఎంపీటీసీ భాస్కర రెడ్డి, సూపర్ వైజర్ సుధాకర్, ఎఎన్ఎం రాధా తదితరులు పాల్గొన్నారు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

లేపాక్షి : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అధికారి డాక్టర్ కృష్ణయ్య తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యాధికారి వెంకట చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 30 వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు జరుగు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు వివరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ సుబ్రమణ్యం, ఫార్మసిస్ట్ సువర్ణ, సీనియర్ అసిస్టెంట్ సురేష్, స్టాఫ్ నర్స్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర ఆలయం సందర్శన

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో గల నీలకంఠేశ్వర స్వామి ఆలయాన్నిఉమ్మడి జిల్లా రిజిస్టర్ కృష్ణకుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రిజిస్టర్‌కు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు.

మాదిగల రాజకీయ చైతన్యసభ

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం ఎపి ఎంఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి ఆధ్వర్యంలో మాదిగల రాజకీయ చైతన్య సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరు పోగు వెంకటేశ్వరరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకలు, హై కోర్టు న్యావాది, శివరామకష్ణ,డివిఎంసి మెంబెర్ వెంకటేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆందోళనతో సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని మాడాల్ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలన్న డిమాండ్‌తో సిఐటియు ఆధ్వర్యంలో చేసిన ఆందోళనతో సమస్య పరిష్కారమైంది. ఆందోళనకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఇంజనీర్లతో కలిసి కాలనీలో శుక్రవారం పర్యటించారు. డిపాజిట్ చెల్లించిన వారందరికి కొళాయి కనెక్షన్ ఇవ్వడంతో పాటు అందరికి నీళ్ల అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యను పరిష్కరించిన సిఐటియు నాయకులు రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఓబుల దేవర చెరువు : వినాయక ప్రతిమల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ గోపీ తెలిపారు. నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికం అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు విడుదల కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రిలేదీక్షలు కొనసాగుతున్నాయి. ఈకార్యక్రమాల్లో ఆపార్టీ ముఖ్య నాయకులు , కార్యకర్తలు పాల్గొంటున్నారు.

వైసిపి పతనం ఆరంభం : తిప్పేస్వామి

మడకశిర : వైసిపి ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి ముందు శుక్రవారం చేపట్టిన రిలేదీక్షల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్య అని అన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న జగన్ రాష్ట్రంలో ప్రతిపక్షం అనేది లేకుండా ఉండాలని కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో. మడకశిర నియోజకవర్గ పరిశీలకులు పులివెందుల పార్థసారథి రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, రొళ్ల మండల కన్వీనర్ దాసిరెడ్డి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్,లక్ష్మీనారాయణతో పాటు కౌన్సిలర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తనకల్లు : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో శనివారం నిర్వహించబోయే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ కోరారు. చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టే ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. ఈ నిరసనదీక్షకు టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆటుపోట్లకు సిద్ధంగా ఉండాలి : పల్లె



రిలేదీక్షలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

పుట్టపర్తి రూరల్ : తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనా సంసిద్ధంగా ఉండాలని పల్లె రఘునాథ్ రెడ్డి నాయకులకు పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ పుట్టపర్తిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం మూడవ రోజు కొనసాగింది. పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట నియోజకవర్గంలోని బుక్కపట్నం మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈసందర్భంగా పల్లె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అరెస్టు చేయించి వైసిపి ప్రభుత్వం చారిత్రాత్మక తప్పిదం చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా పుట్టపర్తి న్యాయవాదులు పలువురు దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం టిడిపి మండల కన్వీనర్ మల్లి రెడ్డి, మాజీ ఎంపిపి బాలు, మాజీ జెడ్పీటీసీ అప్పస్వామి, నాయకులు సుబ్బారెడ్డి, కిష్టప్ప, గొర్లకృష్ణ, కురబ రవి, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ భాష, కలీం ,శాదిక్ షామీర్, మాజీ సర్పంచి యశోద, పుట్టపర్తి సిపిఐ నాయకులు, లాయర్లు యదుభూషణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి మండల నాయకులు శుక్రవారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ వైసిపికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజినప్ప నాయుడు, దండే రవి, శ్రీరాములు నాయుడు, దండే గంగశేఖర్, రామాంజులు, నరసింహులు,అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : ఎవరు ఎన్ని కుట్రలు చేసిన అంతిమంగా న్యాయం గెలుస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్ ను నిరసిస్తూ పార్థసారథి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద మూడవ రోజు సామూహిక రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం సంతోషదాయకం అని తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షకు జనసేన, సిపిఐ, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణప్ప, కురుబ కృష్ణమూర్తి, చిన్న వెంకటరాముడు, సిద్ధలింగప్ప, చంద్ర, భానుకీర్తి, రామకృష్ణ, నాగమణి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సైకో పాలనను అంతమొందించేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పొత్తుతో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం చేపట్టిన రిలే నిరాహారదీక్షలో తెలుగుయువత నాయకులు తిరుమలేష్, వీర, మధు, రాజు, సుధాకర్ సోషియల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ తోటవాసు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఇర్షాద్, చిన్నూరు వినోద్, చెన్నూరు నాగరాజు, అశోక్ తదితరులు కుర్చున్నారు. వీరికి జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు నిదర్శనమే చంద్రబాబు అరెస్టు అన్నారు. టిడిపికి ప్రజల నుంచి వస్తున్న అపూర్వ జనాదరణ చూసి ఓర్వలేక భయభ్రాంతులకు గురైన వైసిపి ఇలాంటి చర్యలకు దిగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, పరిచే సుధాకర్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాద్ నాయుడు, గురుగు వెంగప్ప, అంబటిసనత్ పాల్గొన్నారు.



ధర్మవరంలో రిలేదీక్షలో పాల్గొన్న నాయకులు

తలుపుల : చంద్రబాబునాయుడి అరెస్టుకు వ్యతిరేకంగా తలుపుల తెలుగుదేశం నాయకులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పెద్ద కుంటలో దిగి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దుల రాముడు, కిషోర్, చంద్రుడు, రామచంద్ర, సిపిఐ నాయకులు ఈశ్వరయ్య, రామ్మోహన, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ లేపాక్షిలో శుక్రవారం సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, రామాంజినమ్మ, అంబికా లక్ష్మి నారాయణ, నాగరాజు, రవి, చంద్ర, రాము, అంజి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ సమీపన బాబు తోనే నేను కార్యక్రమం రిలే నిరాహార దీక్షల్లో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు పెట్టడం దారుణం అని ఈసందర్భంగా ఆయన విమర్శించారు. టిడిపి నాయకుల రిలే నిరాహార దీక్షకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు , గోనుగుంట్ల విజయ్ కుమార్ ,ముదిగుబ్బ టిడిపి నాయకులు రమేష్ బాబు, ప్రభాకర్ నాయుడు, తుమ్మల మనోహర్ ,తుమ్మల సూరి , తెలుగు మహిళా అధ్యక్షురాలు రాధమ్మ, అశ్వర్థ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెంగుళూరులో ధర్నాచేస్తున్న ఐటి ఉద్యోగులు

బెంగుళూరులో ఐటీ ఉద్యోగుల ధర్నా

మడకశిర : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో ఐటీ ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేపట్టారు. విధాన సభ సమీపంలోని గన్ పార్క్ వద్ద వేలాదిగా ఐటీ ఉద్యోగులు తరలివచ్చి ధర్నా చేపట్టారు. ఈరోజు ఎంతో మంది ఐటి ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారని చంద్రబాబు వల్ల ఐటి ఉద్యోగులు బెంగుళూరులో నివాసం ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారని అనారు. జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడిని అక్రమ అరెస్టు చేసి ఇబ్బందులు చేయడం ఏమాత్రం తగదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గన్ కు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఐటి ఉద్యోగులు హెచ్చరించారు.

శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకుందాం..

ప్రజాశక్తి-హిందూపురం

ఈనెల 18వ తేదీ వినాయక పర్వదినం, 24వ తేదీన పట్టణంలో వినాయక నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించుకొనేందుకు అందరూ సహకరించాలని డిఎస్‌పి కంజాక్షన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో పట్టణంలోని వినాయక మంటప నిర్వాహకులు, అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పక పోలీసులు అనుమతి తీసుకొని నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ హసీనా సుల్తానా, సిఐలు శ్రీనివాసులు ఎస్ఐ హరూన్‌బాషా, ట్రాన్స్‌కో లక్ష్మీకాంతరెడ్డి, అగ్నిమాపక అధికారి వెంకటేష్, వివిధ హిందూసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

గాండ్లపెంట : ఖరీఫ్‌లో పంట సాగు చేసిన రైతులు తమ పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఎడిఎ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని వేపరాళ్ళ, సోమయాజులపల్లి, మల్ల మీద పల్లి గ్రామాలలో ఈ పంటనమోదును పరిశీలించారు. ఈ నెల 30వ తేదీ లోపల ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో లక్ష్మీప్రియ, ఎఇఒ సింధు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి గుడిబండ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. గుడిబండలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకుమన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, మహిళలు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'చలో మాదిగ' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి మడకశిర రూరల్

మడకశిర పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అంజప్ప ఆధ్వర్యంలో చలో మాదిగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అంజప్ప మాట్లాడుతూ మాదిగల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న పుట్టపర్తిలో కలెక్టర్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, జానకిరామ్, శంకరప్ప, అంజి, శివప్ప, చందు, హనుమంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వాటర్‌కూలర్ వితరణ

ప్రజాశక్తి-తలుపుల

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పెద్దన్నవారిపల్లి గ్రామానికి చెందిన దాత వాటర్ కూలర్ వితరణ చేశారు. గ్రామానికి చెందిన బొమ్మ జయచంద్ర తన తల్లిదండ్రులు జ్ఞాపకార్థం వితరణ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇదిఎపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వ వైద్యులు సల్మా, మున్వర్ బాషా అన్నారు. కార్యక్రమంలో నాయకులు డికె. బాబు మాజీ సర్పంచి పగిడిపల్లి ప్రభువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

బత్తలపల్లి : ఖరీఫ్ సీజన్లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఎడిఎ క్రిష్టయ్య రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గరిశలపల్లిలో నిర్వహించిన ఈపంట నమోదును ఆయన పరిశీలించారు. ఖరీఫ్ సీజన్లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పకుండా పంట నమోదు కార్యక్రమాన్ని చేయించుకోవాలన్నారు. అలాగే పంటలు సాగు చేయని రైతులు ఎవరైనా ఉంటే వారు రైతు భరోసా కేంద్రంలో ప్రత్యామ్నాయ విత్తనాలు తీసుకొని పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఓబిరెడ్డి, ఎవిఎస్ డాక్టర్ లక్ష్మీ నరసింహశర్మ, సర్పంచి పద్మావతి, ఎంపిఇఒ సోమశేఖర్, సచివాలయ కన్వీనర్ రమణారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సమస్యలకు జగనన్న సురక్ష వరం

బత్తలపల్లి : ప్రజల ఆరోగ్య సమస్యలకు జగనన్న సురక్ష వరం కానుందని ఎంపిపి బగ్గిరి త్రివేణి, తహశీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. మండలంలోని గుమ్మళ్లకుంట గ్రామంలో శుక్రవారం ప్రారంభమైన ఇంటింటికీ సర్వేను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. ఈ నెల 30 నుంచి 45 రోజుల పాటు క్యాంపుల్లో ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు వివరించారు. క్యాంపులకు వచ్చే వారికి మౌళిక సదుపాయాలు కూడా కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సునీత, రవికాంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : వ్యం పాలక సంఘ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వార్డు వాలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. శుక్రవారం 11, 12 వార్డు సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు, సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు.

స్కూల్ గేమ్స్ నియోజకవర్గ జట్ల ఎంపిక

హిందూపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంజిఎం పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి 14 నుంచి 17 సంవత్సరాలలోపు బాల బాలికల క్రీడా పోటీలు, ఎంపికలను ఎంఇఒలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం హెచ్‌ఎం సామ్రాజ్యం, పీడీలు రామకృష్ణ, సురేష్ కుమార్, శివకుమార్, మోరార్జీయాదవ్, రామాంజినేయులు, రామ్మూర్తి నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.